ఆంధ్రప్రదేశ్, నవంబర్ 2008

# బతుకుగీత

సాయంత్రం నాలుగు దాటింది.

బట్ట తడుపు జల్లుకొట్టి వెలిసింది. నేల మట్టి వాసనల్నీనుతోంది. ఇంటి వాకిట్లోని వేపచెట్టు బద్ధకంగా చల్లగాలి వీస్తోంది. ఇంటి ముఖద్వారబంధం కిందుగా ఓ బూడిదరంగు మబ్బు తునక – తన వారెవరూ పట్టించుకోని ఏకాకిలా ! తిరగేసిన అర్థచంద్రాకారంతో వ్రేలాడుతోంది. సిటవుట్ పైన రేకుల వసారా. దాని కప్పు మీద ఉండుండి ఓ చినుకు టపటపలాడిస్తోంది.

ముందుగదిలో నుంచి బయటికి చూస్తున్నాడు విశ్వనాథం. మధ్య మధ్య పొద్దున్నే చదివిన దినపత్రికను మళ్ళీ మళ్ళీ తిరగేస్తున్నాడు.

లో గదిలో నుంచి వచ్చింది శాంత. విశ్వనాథం భార్య. గోడకానుకుని కూర్చుంది. భాగవతం తీసింది. రోజూ ఈ సమయంలో ఆమె దినచర్య అదే. పమిటని ఉత్తరీయంలా మెడచుట్టూ తిప్పి ఎడమవైపునకు లాక్కుని కూర్చుంది. భారీ ఆకారం.

బాగా ఎత్తరి. లేత నీలంరంగు చీరె, అంచు రవికె. చేతులకి రెండేసి గాజులు, నుదుట పావలా కాసంత బొట్టు. అరవయ్యోపడిలో పడినా, అంత వయస్సున్నదానిలా కనపడదు.

భార్య మీదకి మళ్ళిన ఆలోచన అంతలోనే పరధ్యానమైంది విశ్వనాథంకి.

కూతుళ్ళు ముగ్గురిలో ఏ ఒక్కరూ ఈ రోజు ఫోన్ చేయలేదు. ముగ్గురూ అమెరికా వాసులే. పెద్దపిల్ల – సరస్వతి. ఆమె కోరి పరుల ఇంట్లో ప్రవేశించింది. ఇమ్తియాజ్‌ని పెళ్లాడింది. ఒక పిల్ల. ఏడాది క్రితం అతని కిడ్నీ చెడిపోతే, తాను తన కిడ్నీని దానం చేసింది. ఆ గాథంతా అమెరికాలోనే జరిగింది. విషయాలన్నీ ఫోన్‌ల మీదే. తామేమైనా ఆర్చేవారా, తీర్చేవారా? వాళ్ల అవస్థలు వాళ్లు పడ్డారు. అతని అన్నలు దేవుళ్ళట!

రెండోది రుక్మిణి. ఆమె, భర్తా – ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. అతనికి డబ్బే యావదాస్తి అంటారు. పిల్లల్లేరు. పది పదిహేనేళ్లు పనిచేసి 'సంపద' సంపాయించి, ఇండియా వస్తానంటూ వుంటాడట.

మూడో కూతురు చంద్రవదన. వాళ్లాయన డాక్టరు. ఆమె గృహిణి. ఇప్పుడు గర్భవతి. ఎనిమిదో నెల. ఆమె అత్తగారు వెళ్లింది – పురిటి వ్యవహారం చూడటానికి.

ఆదివారం ఫోన్ చేయాలి వీళ్లు. ఈ వారం చేయలేదు.

ఇక నాలుగో సంతానం కిరణ్ – ఢిల్లీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్. అతని భార్య స్వరూప. గవర్నమెంట్‌లో ఉద్యోగిని. పిల్లల్లేరు.

వసారాలో అలికిడైంది. ఆలోచనల్లోంచి తేరుకుని లేచాడు విశ్వనాథం. బయటికి వచ్చి చూశాడు.

వసారాలో 'వాడు'! గోడవారగా వున్న ఇనప బెంచీ మీద కూచుని ఉన్నాడు.

ఉరుమూ మెరుపూ లేని వానలా ఊడిపడటం వాడికేమీ కొత్తకాదు. వస్తూనే వుంటాడు. ఇప్పుడు మళ్లీ వచ్చాడు!

'వీడు మారతాడని అంటూ ఉంటాను గానీ, ఆ సూచనలేమీ కనిపించటం లేదు' అనుకుంటూ, వచ్చి తానూ అదే బెంచీ మీద కూచున్నాడు విశ్వనాథం.

"అంతా బావున్నార్రా?" అడిగాడు.

వాడు తల ఊపాడు. వాడు మాట్లాడడు. చూస్తాడు. నుదిటి క్రిందుగా బావుల్లా కనిపించే కళ్లల్లో నుంచి చురుగ్గా చూస్తాడు. చూస్తూ తలని ఒకింత పంకిస్తాడు.

అది అవుననో, కాదనో - ఎదుటి వ్యక్తి ఇష్టప్రకారం అర్థం చేసుకోవచ్చు. సందర్భంతో సంబంధం లేకుండా తొంభైశాతం వాడి ప్రతిచర్య మాత్రం అదే.

ఇంతకీ 'వాడు' విశ్వనాథం అన్న కొడుకు. పేరు శివ.

శివ వైపు తేరిపారా చూశాడు విశ్వనాథం.

వయసెంతో తెలియనీయని కాయబారు శరీరం. మనిషి నలుపు. నుదురు విశాలం. పెదాలు నెర్రెలు విచ్చిన నల్లరేగడి గడ్డల్లా మొద్దుగా, చూపరులకి విలక్షణంగా కనిపిస్తాయి. చాలీచాలని పంచెకట్టు, బొత్తాలూడిపోయిన పాతలాల్చీ. భుజం మీద మాసిపోయిన కాశీ తువ్వాలు. ఇదీ అవతారం.

కాఫీ తీసుకుని వచ్చి, ఇచ్చింది శాంత. "రమా, పిల్లలూ కులాసానా?" పలకరించింది. గుమ్మం పక్కగా నిలబడింది.

శివ తల ఊపాడు.

కాఫీ పూర్తి చేశాడు.

"చెప్పు" అన్నాడు విశ్వనాథం.

"గుంటూరులో ఉండి లాభం లేదు. పరిస్థితులేం బాగా లేవు" రాని పాఠం వొప్పజెప్పటానికి ప్రయత్నిస్తున్న బడి పిల్లవాడిలా మాటలు కూడదీసుకుని చెప్పాడు శివ.

"మాకు ఇదేం పెద్దవార్త కాదుగా శివా" అంటూ కప్పు తీసుకుని ఇంట్లోకి నడిచింది శాంత.

విశ్వనాథంని గతం కెలికింది.

వీడు అన్నయ్యకి చాలా కాలానికి లేక లేక కలిగిన నలుసు. ఒంటికాయ-శొంఠికొమ్ము. వీడికి అదిగో ఇదిగో అని గ్రాయకం తెలిసేసరికి ఆయన కాలం చేశాడు. తానుగా, మమకారం చావక, రక్తసంబంధం మరవలేక ఎంతెంతగా తాపత్రయపడినా చదువూ సంధ్యా అబ్బలేదు. వదిన పాపం ఏడ్చేది. మొత్తుకునేది. తలబాదుకునేది. తన పిల్లల్ని చూపి బుద్ధులు చెప్పేది. వీడు చదువుకుని ప్రయోజకుడైతే చూడాలని పాపం - ఎండుకొమ్మ వాన కోసం ఎదురుచూసినట్టు చూసింది. చివరికి చూపుల్ని పొద్దుతిరుగుడు పువ్వులా వాడిని అంటిపెట్టుకుని ఉండగానే, ఒక అసురసంధ్యలో 'హరీ'మంది. తల్లిపోయినా వీడు మామూలే.

శాంత అంటూ వుండేది, 'శివ మారటం కలలో మాట' అని. తానే 'ఎప్పుడో

అప్పుడు వాడే మారతాడు లేవే' అని నచ్చచెప్పేవాడు. 'మీ అలుసు చూసుకుని అగ్రహారపు బడితెలా తిని తిరగటం, పేకాటా, కాలక్షేపం అలవాటయినై' అని నిష్ఠూరమాడేది ఆమె.

పెళ్లి చేస్తే బాధ్యత తెలిసి వస్తుందనే ఆశతో – ఆ పిల్ల రమని కట్టబెట్టారు. ఆ పిల్ల అణకువా, పొందికా వున్న గృహిణి. ఐదేళ్ళ సంసారం. ముగ్గురు పిల్లలు.

వాడు ఏ షావుకారు దగ్గరో అమూంబాపతు అన్ని పనులూ చేసే గుమాస్తాగిరీ వెలగబెట్టేవాడు. కానీ, ఎక్కడా పట్టుమని పదినెలలు ఉండే మనస్తత్వం కాదు. ఉన్నట్టుండి వ్యాపారమని తన దగ్గర బాగానే తీసుకుని వెళ్ళాడు. అదీ మూన్నాళ్ల ముచ్చటే. బియ్యం వ్యాపారం చేసి నష్టపోయిన వీరుడు వాడు.

ఠక్కున వస్తాడు. బండెడు చీకటి నెత్తిన వేసుకుని ఆ రమా, పిల్లలూ వస్తారు. నాలుగు రోజులుండి వాళ్లని ఇక్కడ దించేసి వాడు వెళ్లిపోతాడు. ఇదొక ఆనవాయితీ. ఏడాదిలో ఐదారు నెలలు రమా, పిల్లలూ ఇక్కడే మకాం.

ఆ సమయంలో వాడు ఎక్కడుంటాడో, ఏం చేస్తూ వుంటాడో భార్యకీ తెలియదు. పదిహేను, ఇరవై రోజులకోసారి వస్తాడు. మూడు నాలుగు రోజులుంటాడు. ఉన్నప్పుడు మాట్లాడడు. వెళ్ళేటప్పుడు చెప్పడు.

"పెళ్లాం కోసం ఆయనగారి రాక. ఆ మాత్రం విషయం ఆ చంటిదానికూడా తెలుసు" అన్నదొకసారి శాంత.

భార్య కోపం ధర్మాగ్రహమని విశ్వనాథంకీ తెలుసు. వాళ్ళిద్దరే శివ గురించి మాట్లాడుకునేటప్పుడు విశ్వనాథం అంటూ ఉంటాడు, "శివ ఎప్పటికైనా మారతాడు. నాకా నమ్మకం ఉంది" అని.

ఆయన నమ్మకం మాత్రం ఇప్పటివరకూ ఆశగానే మిగిలిపోయింది.

మళ్ళీ వాన మొదలైంది. ముగ్గురూ ముందు గదిలోకొచ్చారు.

"ఏమైందయితే" అంటూ ప్రశ్నించాడు విశ్వనాథం.

నిమ్మళంగా చెప్పుకొచ్చాడు శివ. "ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెట్టాను. మొదట్లో బాగానే సాగింది. ఒక్కటే పెద్ద రూం. నాలుగు నెలల తర్వాత మాకెదురుగా ఒక బండి వెలిసింది. ఇడ్లీ, దోశా అన్ని ఐటమ్స్ మీదా ఒక రూపాయి తక్కువ రేటులో. మొగుడూ, పెళ్లాం, ఒక పెళ్లీడు కూతురు. చెయ్యి పడిపోయేటట్లు చేస్తున్నారు వ్యాపారం. ఇంకా నాలుగు నెలలకి, అదే లైన్‌లో పెద్ద దర్శినీ వచ్చింది. లక్షల్లో పెట్టుబడి

ఛాట్‌లు, జ్యూస్‌లు, చైనీస్‌ఫుడ్.... అన్ని రకాలూ... ఈ రెండు కలిసి మనల్ని ఈగలు తోలుకునే స్థితికి తెచ్చినై. యాభైవేలు అప్పు తేలింది."

శివ వైపు విస్తుపోయి చూస్తున్నాడు విశ్వనాథం.

"నిండా పదినెలలు కాలేదు - మీరు వెళ్లి" అన్నది శాంత. ఆ మాటల్లోనే ఆమె బాధనంతా క్రుమ్మరిస్తూ.

"అంత మొత్తమా?" అని "ఎవరిచ్చారు?" అన్నాడు విశ్వనాథం. ఆయనకి అసహనంగా ఉంది.

వెంటనే ఏమీ చెప్పలేదు శివ. తలవంచుక్కూచున్నాడు. భుజం మీది తువ్వాలును చేత్తో విదిలించుకుని మొహం మీది చెమట తుడుచుకుంటూ ఠక్కున చెప్పేశాడు.

"ప్రైవేట్ ఫైనాన్స్ వాళ్ల దగ్గర తీసుకోవాల్సి వచ్చింది."

విశ్వనాథంకి గుండెల్లో రాయి పడింది. ఆయనకి చెమటపట్టింది. తుండుతో తుడుచుకుని అడిగాడు.

"వడ్డీ అన్నా కడ్తున్నావా?" అని.

"కొంత బకాయి వుంది" అని ముక్తసరిగా చెప్పి, "మొత్తం ఓ అరవై సర్దితే...." అన్నాడు.

'అవును బాగుంటుంది. మళ్లీ అప్పు చేయవచ్చు' అని తనలో తాను అనుకుంది శాంత. ఆమె భావన విసుగులోనుంచీ, వేష్టపడటం వలన వచ్చింది.

విశ్వనాథంకి పాత సంఘటన ఒకటి గుర్తుకొచ్చింది.

ఒకసారిలాగే శివ ఎవరో కాబూలీవాలా దగ్గర ఐదువేలు అప్పు తీసుకుంటే, అతను అర్ధరాత్రి కతి పుచ్చుకుని ఇంటిమీదికొచ్చాట్ట. రమా, పిల్లలూ భయపడిపోయి బెంబేలెత్తిపోయారు. ఆమె బయటికొచ్చి తనకు ఫోన్ చేసింది. ఆ కాబూలీవాలాని టెలీఫోన్ బూత్‌కి పిలిపించి, తాను సర్దిచెప్పి, హామీ ఇవ్వాల్సి వచ్చింది. మర్నాడు తనే వెళ్లి డబ్బు ఇచ్చి వచ్చాడు.

ఎవరి ఆలోచనల్లో వాళ్లున్నారు - విశ్వనాథం, శాంత. ఏ స్థిమితం లేకుండా టీ.వి. వైపూ, ఉండుండి గోడమీది క్యాలండర్లవైపూ చూస్తూ కూర్చున్నాడు శివ.

రాత్రి భోజనాలైనాయి.

వర్షం కురుస్తూనే ఉంది.

ముగ్గురూ ముందుగదిలోనే కూచుని వున్నారు.

"అరవై వేలు కాదు గదా, ఆరువేలు కూడా లేవే. ఏదో పెన్షన్ మీద నెట్టుకొస్తున్నాం. ఎట్లా?" అని సాలోచనగా అన్నాడు విశ్వనాథం.

"రేపు ఎటూ రమా, పిల్లలు ఇక్కడుండాల్సిన వాళ్లేగా. మా అవస్థేదో మేం పడాలి. దానికి తోడు ఇట్టా వేలకి వేలంటే ఎలా?" అన్నది శాంత.

ఇంతలో ఫోన్ మ్రోగింది. విశ్వనాథమే తీశాడు. అవతలివైపు కిరణ్ – ఢిల్లీ నుంచి.

ఫోన్ ఆఫ్ చేసి శాంతనుద్దేశించి చెప్పాడు విశ్వనాథం. "స్వరూపకి మధ్యాహ్నం అబార్షన్ జరిగిందట. హాస్పిటల్‌లో వుందిట. వాళ్ళమ్మ ఢిల్లీలోనే వుందట. వచ్చి పదిరోజులైందట."

శాంత మనసు బాధపడింది. ఇది మూడోసారి ఇలా జరగటం. వచ్చిన గర్భం నిలవటం లేదు. ఆమె కొంగుతో కళ్లొత్తుకుంది.

గదిలో గంభీరమైన నిశ్శబ్దం ఆవరించింది.

విశ్వనాథం ఆలోచన ఇప్పుడు శివ డబ్బు సంగతేమిటా అనే. ఈ పరిస్థితుల్లో కిరణ్‌ని అడగటం బాగుండదు. అడక్కుండా ఎలా?

ఒక్కటే దారి కనపడుతోంది. కానీ, ఆ పని చేస్తే? ఏదో తెలియని భయం వెన్నుని జలదరింపచేసింది.

'నా వల్ల కాదని చెప్పేసి వదిలించేసుకుంటే' ఈ నిస్సహాయస్థితిలో వాడైనా ఏం చేయగలడు? అంత డబ్బెవరిస్తారు? అసలు ఏం చూసి ఇవ్వగలరు? అప్పుడు అసహాయంగా పిచ్చివాడైపోయి ఏ అఘాయిత్యమో చేస్తే? అసలదేగదా శివ గురించి, వాడి చిన్నతనం నుంచీ తనకున్న భయం.

ఏ కొలిక్కీ రాని చిక్కుపడిన దారపు ఉండలా అయింది మనస్సు.

పక్కలు ఏర్పాటయినై.

రాని నిద్రకు ఉపక్రమించాడు విశ్వనాథం.

మరో కొన్ని నిముషాల్లోనే గుర్రు మొదలెట్టాడు శివ.

విశ్వనాథం వేదాంతిలా నవ్వుకున్నాడు.

తెల్లవారుతూనే వెళ్లిపోయాడు శివ.

నాలుగు రోజుల్లో వచ్చి డబ్బు తీసుకుపొమ్మన్నాడు విశ్వనాథం.

విశ్వనాథంకి లోపిరికి, వెలిపిరికిగా వుంది. శివకి సహాయం చెయ్యాలంటే ఉన్నది ఒక్కటే మార్గం. తన ప్రతిపాదనని శాంతకి చెప్తే ఆమె ఎలా 'రిసీవ్' చేసుకుంటుందో? దీనికితోడు ఓ నెలక్రితం కిరణ్ విజయవాడ వచ్చినప్పుడు అతనితోనూ ఆ విషయం చెప్పేశాడు ప్రసంగవశాత్తూ. వాడికి తెలిస్తే వాడేమంటాడో?

అయినా తనకు వేరే ప్రత్యామ్నాయం ఏముందిప్పుడు?

పరిపరి ఆలోచనలతోనే సమయాన్ని భారంగా గడుపుతున్నాడు విశ్వనాథం. శాంత ఆ విషయప్రసక్తి తీసుకురాలేదు. ఆమెకి శివ మాట మాత్రం కూడా తనతో వెళ్తున్నానని చెప్పి పోలేదని మనసుకు కష్టంగా ఉంది.

టిఫిన్ అయింది. తింటూ తన మనసులో మాటని బయటపెట్టాడు విశ్వనాథం.

శాంతకి భర్త బలహీనత తెలుసు. అన్నగారి మీద ఆయనకి వల్లమాలిన ప్రేమ, అభిమానం, గౌరవం, కృతజ్ఞత కూడా – తన బాగోగుల్ని అంతో ఇంతో పట్టించుకున్నాడని. అందువలన శివ పట్ల ఆయనెప్పుడూ మెతకవైఖరే అవలంబిస్తాడని అనుభవపూర్వకంగానే తెలుసుకుని ఉన్నదామె.

మౌనంగా స్టూలు మీద కూర్చుంది, గోడని చూస్తూ.

కొంతసేపటికి తనకు తాను చెప్పుకుంటున్నట్టు పైకే అన్నది "మీకు అన్నీ తెలుసు. ఏది మంచిదనుకుంటారో అలా కానీయండి" అని.

"మనం కాక వాళ్లకి మాత్రం ఎవరున్నారు ఇలాంటి ఆపదల్నుంచీ బయటికి లాగేందుకు?" అన్నది చాలా సౌమ్యంగా, సానుభూతిగా.

శాంత 'మనం' అన్నందుకు విశ్వనాథంకి చాలా ఊరట కలిగింది. మనసు తెలిసినవాడే అయినా ఆమె మాటలు నిజంగా ఆయనకి చాలా ఉపశమనాన్నిచ్చాయి.

నాలుగు రోజుల్లోపే గుంటూరు నుంచీ శివ వచ్చి డబ్బు తీసుకుని వెళ్లాడు.

పదిహేను రోజులు గడిచినై. విశ్వనాథం, శాంత అనుకున్నట్టు రమా, పిల్లలూ వీరింటికి రాలేదు.

విషయం మరుగున పడింది.

రోజులు నెలలైపోయాయి.

+ + +

ఆ రోజు

ఉదయం పది గంటలు కావస్తోంది. ముందుగదిలో పేపరు చదువుతున్న విశ్వనాథం "శాంతా" అంటూ ఒక గావు కేక పెట్టాడు.

ఆమె వచ్చి చూసేసరికి -

కుర్చీలో మనిషి కుర్చీలో బిగదీసుకుపోయాడు. ఆమె నెత్తీనోరూ కొట్టుకుంటుండగానే, చుట్టుప్రక్కల నలుగురూ చేరుతుండగానే అంతా అయిపోయింది.

అనివార్యమైనది జరిగిపోయింది. విశ్వనాథం ఇక లేడు!

ముగ్గురు ఆడపిల్లలూ రాలేరని తేలిపోయింది.

రాత్రికి కిరణ్ వచ్చాడు. స్వరూప రాలేకపోయింది. ఆఫీసు వ్యవహారం. గవర్నమెంటుతో పని. సెలవు దొరకలేదు. బంధువులూ, రావలసినవారూ, రాదలచినవారూ వచ్చారు.

కర్మాంతరాల గురించిన తర్జనభర్జనల్లో తల్లి నడిగాడు కిరణ్ "నాన్నగారు ఎంతో ముందు జాగ్రత్తగా ఈ ఖర్చుకి ముప్పై వేలు జాయింట్ ఎకౌంట్‌లో వేశానని చెప్పారు. అవి తీసి వాడదాం. నేను అర్జంటుగా బయల్దేరటం, ఫ్లైట్‌లో రావటం - డబ్బేమీ తేలేదు."

శాంత ముఖంలో మార్పు వచ్చింది. కొడుకు వైపు నిర్లిప్తంగా చూసింది. క్షణాల తర్వాత అసలు విషయాన్ని హీనస్వరంతో చెప్పేసింది.

"శివ నెత్తిమీదకొస్తే, అతని అప్పు తీర్చటానికి ఆ డబ్బుని తీసేసి ఇచ్చారు."

కిరణ్‌కి చాలా కోపమొచ్చింది. నిగ్రహించుకోలేకపోయాడు. దుఃఖపు ముద్దగా తండ్రి శవం దగ్గర కూర్చున్న తల్లి మీద ఒంటికాలిపై లేచాడు. శివ బతుకంతటినీ జనం ముందు పరిచాడు. అయినవాళ్లూ, కానివాళ్లూ - నలుగురూ నాలుగు విధాలుగా వ్యాఖ్యలూ, వ్యాఖ్యానాలూ చేశారు. వారిలో స్వరూప దూరపు బంధువొకాయన కిరణ్‌కి 'వాదోడు'గా తయారయినాడు.

"నాన్నగారి చావుకి అసలు వాడు కల్పించిన మానసిక క్షోభే కారణం. మొహం చెల్లకే రాలేదు. పనికిరాని మైనర్ ముండాకొడుకు......" కిరణ్ ఆగ్రహంతో శివపై కారాలూ, మిరియాలూ నూరాడు.

రాత్రి గడుస్తోంది. నీరసంగా, వివరంలేని సవ్వళ్ళతో...

శవం లేవని ఇల్లు. మూగచూపులతో, నిశ్శబ్ద విషాద ప్రకటనలతో! కిరణ్ మనసులోని అలజడితో, ఆందోళనతో పచార్లు చేస్తూ గంటలు గడుపుతున్నాడు.

తెల్లవారుఝాము మూడయింది.

శివ, రమ వచ్చారు. పిల్లలు రాలేదు. శాంత పక్కన చేరి కళ్లొత్తుకుంది రమ. గోడకానుకుని కూర్చుంటున్న శివని ఏహ్యభావంతో, కోపంతో చూశాడు కిరణ్.

క్షణాల తర్వాత పిన్నినీ, అన్ననీ పలకరించాడు శివ. పొడిపొడిగా మాటలు కలిసి ఆగిపోయినై.

"నాన్న చావుకి మీ గురించిన మానసిక క్షోభే కారణం" అన్నాడు కిరణ్, ఒక సందర్భంలో.

శివ ఏం మాట్లాడలేదు. రమ మొహమెత్తి ఆయన వైపు చూసి, శాంతవైపు చూపు మరల్చుకుంది.

మరో పావుగంట తర్వాత.

శివ నెమ్మదిగా లేచి వెళ్లి శాంత పక్కన కూర్చున్నాడు. చేతి సంచీలోంచీ డబ్బు తీసి ఆమె చేతి పక్కగా పెట్టాడు.

"ముప్పైవేలు పిన్ని. బాబాయ్ నాకంతా చెప్పాడు" అని గోడకి చేరగిలబడ్డాడు.

క్షణాల తర్వాత ప్రయత్నపూర్వకంగా కళ్లెత్తి శివవైపు చూసింది శాంత. అతని కళ్లల్లో చెమ్మ! కాశీ తువ్వాలుతో తుడుచుకుంటున్నాడు. చూపులు పక్కకి మరల్చి రమని చూసింది.

కొంచెం దగ్గరగా జరిగింది రమ. "అప్పులన్నీ తీర్చేసి కర్రీ పాయింట్ పెట్టాం అత్తయ్యా. బాగా జరుగుతోంది. మా కష్టాలు తీరినట్టనిపిస్తోంది" అన్నది. బలహీనమైన కంఠస్వరంలోనే ఆత్మవిశ్వాసం తొణికిసలాడింది.

ఇప్పుడు శాంత దృష్టి భర్తమీద! పల్చటి కన్నీటితెర ఆమె చూపుని అడ్డుకుంది.

'శివ మారతాడే. నాకా నమ్మకం ఉంది' అని అంటున్నట్టే పడుకుని ఉన్నాడు విశ్వనాథం.

అన్ని యాత్రలకీ సమయసూచనగా తెల్లవారబోతోంది.